సాక్షి
నంద్యాల
గురువారం । 12 । డిసెంబర్ । 2024



అన్నదానానికి రూ.లక్ష విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలోని అన్నప్రసాద వితరణకు బుధవారం విజయవాడకు చెందిన అవుతపల్లి శ్రీనివాసరావు రూ.1,01,116 విరాళాన్ని దేవస్థాన ఏఈఓ జి.స్వాములుకు అందించారు.



అలరించిన 'శివానందలహరి'

శ్రీశైలంటెంపుల్: ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన జి.చేతన.. శివానందలహరి పారాయణ కార్యక్రమం అలరించింది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	:1,633
ప్రస్తుతం	:1,629.35
సామర్థ్యం (టీఎంసీలు)	:105.788
ప్రస్తుతం	:91.702
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:3,624
అవుట్ ఫ్లో	:5,173

న్యూస్‌రీల్

శాస్త్రోక్తంగా కైసిక ఏకాదశి



ఉత్సవమూర్తులకు తిరుమంజనం నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలం లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో కైసిక ఏకాదశిని పురస్కరించుకుని బుధవారం విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున మూల మూర్తులను సుప్రభాతసేవతో మేలుకొలిపి దివ్యదర్శనం అనంతరం నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరదస్వాములను ఆలయ ముఖద్వార మండపంలో కొలువుంచి పంచామృతాలతో అభిషేకించి వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య దూప దీపాలతో మహా మంగళహారతి అందించారు. రాత్రి విశేష అలంకరణలో స్వామి, అమ్మవార్లు పల్లకీపైకొలువుదీరి తిరువీధిలో విహరించారు.

కార్తీక మాస శివదీక్షా విరమణ ప్రారంభం



శివదీక్షా విరమణ చేస్తున్న శివస్వాములు

శ్రీశైలంటెంపుల్: కార్తీక మాస శివదీక్షా విరమణ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. పాతాళ గంగ మార్గంలోని శివదీక్షా శిబిరాలలో భక్తుల సౌకర్యార్థం ఐదు రోజుల పాటు దీక్షా విరమణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉదయం ఆలయ దక్షిణద్వారం వద్ద స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకీలో ఆశీనులను చేయించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను మంగళవాయిద్యాల మధ్య వేదమంత్రాలతో రథవీధిలో ఊరేగింపుగా తీసుకెళ్లి శివ దీక్షా శిబిరాలలో ఆశీనులను చేయించారు. స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు షోడశోప చారాలతో పూజాదికాలు నిర్వహించారు. శివ దీక్షా విరమణ కార్యక్రమం పూర్తయ్యేంత వరకు శిబిరాలలోని దేవతామూర్తులకు ఉభయసంధ్యలలో శాస్త్రోక్తంగా పూజాదికాలు జరిపారు. అనంతరం దీక్షా శిబిరాలలోని హోమగుండానికి అర్చకులు పూజలను జరిపి, హోమాగ్నిని ప్రజ్వలింపజేశారు. ఓం నమఃశివాయ ప్రణవ పంచాక్షరీ నామస్మరణతో శివదీక్షా విరమణ కార్యక్రమం ప్రారంభమైంది. దీక్షా విరమణ చేసే భక్తులంతా స్వామివారికి జ్యోతిర్ముడిని సమర్పిస్తున్నారు. ఆవు నెయ్యి, నారికేళం మొదలైన ద్రవ్యాలను హోమగుండంలోకి ఆహుతిగా భక్తులు సమర్పిస్తున్నారు.

15న ఆత్మార్పణ దినం నిర్వహించాలి

నంద్యాల(న్యూటౌన్): అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 15న అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఆత్మార్పణ దినం నిర్వహించాలని డీఈఓ జనార్దన్‌రెడ్డి బుధవారంధిక ప్రకటనలో పేర్కొన్నారు. 14 ఏళ్లలోపు విద్యార్థులకు అమరజీవి జీవితంపై వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించి 16న బహుమతులు అందజేయాలన్నారు. ఆయన వెంట డీసీసీబీ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ బ్రహ్మం నాయక్ పాల్గొన్నారు.



హాలహర్విలో ఫాంపాండ్ నిర్మిస్తున్న దృశ్యం

అవినీతి ప్రవాహం

వర్షపు నీటిని సంరక్షించి భూగర్భ జలాలు పెంచే లక్ష్యంతో చేపట్టిన వాటర్‌షెడ్ పథకంలో అవినీతి ఏరులై పారుతోంది. క్షేత్రస్థాయి పర్యవేక్షణ అధికారులు, వాటర్‌షెడ్ కమిటీ ప్రతినిధులు కుమ్మక్కై నిధులను కొల్లగొడుతున్నారు. అక్రమాలు బయట పడకుండా అనంతపురం, వైఎస్సార్ జిల్లాల నుంచి కూలీలను తెప్పించుకొని పనులు చేయిస్తున్నారు. నిర్దేశిత గడువు సమీపిస్తుండటంతో నిధులు ల్యాప్స్ అవుతాయనే భయంతో అధికారులే కాంట్రాక్టర్ల అవతారమెత్తి అక్రమాల వేగాన్ని పెంచేశారు.

- ఉమ్మడి జిల్లాలో పీఎంకేఎస్‌వై 2.0 కింద ఏడు వాటర్‌షెడ్ ప్రాజెక్టులు
- రూ.74.88 కోట్లతో అభివృద్ధి పనులు
- కాంట్రాక్టర్ల అవతారమెత్తిన వాటర్‌షెడ్ అధికారులు
- క్షేత్రస్థాయి అధికారులతో వాటర్‌షెడ్ కమిటీ ప్రతినిధుల కుమ్మక్కు
- పైపై మెరుగులు దిద్ది నిధులను కొల్లగొడుతున్న వైనం

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రధానమంత్రి క్రిషి సంచాయ్ యోజన 2.0 కింద రూ.74.88 కోట్లతో వాటర్‌షెడ్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. కర్నూలు జిల్లా ఆలూరు డబ్ల్యూసీసీ కింద హాలహర్వి, కందనాతి, పెద్దహరివాణం, కర్నూలు డబ్ల్యూసీసీ పరిధిలోని ఎద్దుపెంట, ఆకుమల్ల తదితర ఏడు వాటర్‌షెడ్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటికి అనుబంధంగా కర్నూలు జిల్లాలో 17, నంద్యాల జిల్లాలో 11 మైక్రో వాటర్‌షెడ్‌లు ఏర్పాటు చేశారు. కర్నూలు జిల్లాలోని ఐదు ప్రాజెక్టుల్లో 24,276 హెక్టార్లు, నంద్యాల జిల్లాలోని రెండు ప్రాజెక్టుల్లో 9763 హెక్టార్లు.. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 34,089 హెక్టార్ల భూమి కవర్ చేయాలనేది ప్రధాన ఉద్దేశం. ఒక్కో హెక్టారుకు నాలుగేళ్లలో రూ.22 వేల ప్రకారం ఖర్చు చేస్తారు. కర్నూలు జిల్లాలో రూ.53.41 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.21.48 కోట్లు వాటర్‌షెడ్ కార్యక్రమాలకు ఖర్చు చేస్తారు. మార్చిలోపు వీలైనంత ఎక్కువగా పనులు చేసి నిధులను దండుకోవాలనేది వాటర్‌షెడ్ అధికారులు, వాటర్‌షెడ్ కమిటీ ప్రతిధుల లక్ష్యమని గ్రామాల్లో చర్చ జోరుగా సాగుతోంది.



ఎద్దుపెంటలో చెక్ డ్యామ్ నిర్మిస్తున్న దృశ్యం

టీడీపీ నేతలతోనే వాటర్‌షెడ్ కమిటీలు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 7 వాటర్‌షెడ్ ప్రాజెక్టులు ఉన్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వాటర్‌షెడ్ కమిటీల్లో సమూలంగా మార్పులు జరిగాయి. ఈ ఏడాది జూన్ వరకు ఉన్న వాటర్‌షెడ్ కమిటీల సెక్రటరీలు, చైర్మన్, ప్రెసిడెంట్లను బెదిరించి, వేధించి రాజీనామాలు చేయించారు. కీలకమైన అన్ని పోస్టుల్లో టీడీపీ నేతలు, కార్యకర్తలు చేరారు. మొత్తంగా వాటర్‌షెడ్ పనులు టీడీపీ నేతల ఆధ్వర్యంలోనే జరుగుతున్నాయి. ప్రస్తుతం న్యాచురల్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ కింద వాటర్‌షెడ్ గ్రామాల్లో భూగర్భ జలాల అభివృద్ధికి సంబంధించిన పనులు నిర్వహిస్తున్నారు. చెక్‌డ్యామ్స్/చెక్‌వాల్స్, పర్క్యులేషన్ ట్యాంకులు/ మినీ పర్క్యులేషన్ ట్యాంకులు, ఫాంపాండ్స్/డగౌటు పాండ్స్, ఎల్‌బీఎస్/ ఆర్‌బీడీ పనులు నిర్వహిస్తున్నారు. ఈ పనుల్లో అవినీతి, అక్రమాలు పొంగిపొర్లుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మెరుగులు దిద్ది... నిధులు కొల్లగొట్టి!

వాటర్‌షెడ్‌లకు సంబంధించి క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులే కాంట్రాక్టర్ల అవతారాలెత్తి పనులు చేస్తున్నట్లు తెలుస్తోంది. నిబంధనల ప్రకారం వాటర్‌షెడ్ కమిటీల ఆధ్వర్యంలో వినియోగదారుల బృందాల చేత పనులు చేయించాల్సి ఉంది. అయితే అధికారులు వాటర్‌షెడ్ కమిటీలకు కమీషన్‌ల ఎర వేసి సొంతంగా నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. హాలహర్వి ప్రాజెక్టులో మూడు, కందనాతి ప్రాజెక్టులో 2, పెద్ద హరివాణం ప్రాజెక్టులో 4 మైక్రో వాటర్‌షెడ్‌లు ఉన్నాయి. ప్రస్తుతం జరుగుతున్న వాటర్‌షెడ్ పనులన్నీ పైపై మెరుగులకే పరిమితం అవుతున్నాయి. గతంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వాటర్‌షెడ్ కార్యక్రమాలు జరిగాయి. దాదాపు అన్ని మండలాల్లోని వాగులు, వంకలకు చెక్ డ్యామ్‌లు, చెక్‌వాల్స్, డగౌటు పాండ్స్, ఆర్‌ఎఫ్‌డీలు తదితర అన్ని రకాల పనులు జరిగాయి. గతంలో జరిగిన పనులకే మెరుగులు దిద్ది మమ అనిపిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రూ.3 లక్షల విలువ పనికి రూ.50 వేల వరకే ఖర్చు చేసి రూ.2.50 లక్షలు స్వాహా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అన్ని మైక్రో వాటర్‌షెడ్‌ల్లో ఎన్‌ఆర్‌ఎం పనులు పైపై మెరుగులకే పరిమితం అవుతున్నట్లు స్పష్టమవుతోంది. అక్రమాల నిగ్గు తేల్చాల్సిన సోషల్ ఆడిట్ బృందాలు సైతం మామూళ్ల మత్తులో జోగుతున్నాయనే ఆరోపణలున్నాయి. ఎన్‌ఆర్‌ఎం కింద రూ.10.09 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. ఇందులో ఇప్పటి వరకు రూ.3.16 కోట్లు ఖర్చు చేశారు. మార్చిలోపు మొత్తం నిధులను ఖర్చు చేయాల్సి ఉంది. మార్చిలోపు పాత పనులకే మెరుగులు దిద్ది నిధులు స్వాహా చేయడానికి క్షేత్రస్థాయి అధికారులు, వాటర్‌షెడ్ కమిటీలు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. కొన్ని పనులు చేయక పోయినప్పటికీ చేసినట్లు రికార్డు చేసి నిధులు స్వాహా చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి.

పంచాయతీలను పట్టించుకుంటే ఒట్టు

ఎన్‌ఆర్‌ఈజీఎస్, వాటర్‌షెడ్ పనులు చేపట్టాలంటే విధిగా గ్రామ పంచాయతీల తీర్మానాలు అవసరం. అయితే తీర్మానాలు లేకుండానే పనులు చేస్తున్నట్లు తెలుస్తోంది. తీర్మానం ఆమోదం పొందాలంటే సర్పంచ్, పంచాయతీ సెక్రటరీలు సంతకాలు అవసరం. కానీ కీలకమైన వీరి సంతకాలు లేకుండానే తీర్మానాలు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఓర్వకల్లు మండలం కాల్వ గ్రామంలో గ్రామ పంచాయతీ తీర్మానాలు లేకుండానే వాటర్ షెడ్ పనులు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో డబ్ల్యూసీసీలో ఎంట్రీ పాయింట్ యాక్టివిటీ కింద 95 శాతం వరకు నిధులు ఖర్చు చేశారు. పీఎస్‌ఐ కింద రూ.3.22 కోట్లు ఖర్చు చేయాల్సి ఉండగా.. రూ.1.48 కోట్లు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. వాటర్‌షెడ్‌ల ముగింపు గడువు సమీపిస్తుండటంతో పీఎస్‌ఐలో మిగిలిన నిధులను ఏదో విధంగా ఖర్చు చేసినట్లు చూపి కొల్లగొట్టేందుకు ఇటు అధికారులు, అటు వాటర్‌షెడ్ కమిటీలు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. వీలైనంత వరకు వాటర్‌షెడ్‌ల ద్వారా జేబులు నింపుకోవాలనే తపన కనిపిస్తోంది.

మా ప్రాంతంలో సిలికాన్ కంపెనీ వద్దు

- ప్రజాభిప్రాయ సేకరణలో జేసీకి తెగేసి చెప్పిన 49-బన్నూరు గ్రామస్తులు



జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్

మిడుతూరు: సిలికాన్ తవ్వకాల కోసం మా ప్రాంతంలో కంపెనీ పెట్టొద్దని మండల పరిధిలోని 49-బన్నూరు గ్రామస్తులు ముక్తకంఠంతో అధికారులకు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో బుధవారం సిలికాన్ ఖనిజం తవ్వకం విషయమై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. గ్రామ పరిధిలోని ప్రతిపాదిత 384/పి సర్వేనంబర్ వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ పాల్గొన్నారు. మెస్సర్ షిరిడీ సాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ సిలికా శ్యాండ్ క్వార్ట్జైట్ గని ఆధ్వర్యంలో 384 పి సర్వేనంబర్‌లో విస్తరించి ఉన్న 22 హెక్టార్లలో ఖనిజం తవ్వకం విషయమై ఏమైనా అభ్యంతరాలు ఉన్నాయా అని జేసీ అడగగానే.. గ్రామంలోనే ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాల్సి ఉండగా 6, 7 కిలోమీటర్ల దూరంలో సభ నిర్వహించడం పట్ల ముందుగా ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేశారు. తమ ప్రాంతలో సిలికాన్ కంపెనీ వద్దని ముక్తకంఠంతో చెప్పారు. గ్రామానికి మౌలిక వసతులు కల్పించడంతోపాటు అభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని కంపెనీ ప్రతినిధి వివరించే ప్రయత్నం చేయగా తమకేమీ వద్దంటూ ప్రజలు తిరస్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, మండల సర్వేయర్ కృష్ణుడు, వీఆర్వో సోఫిసాహెబ్ పాల్గొన్నారు.

10,884 క్యూసెక్కుల నీటివిడుదల

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయం నుంచి మంగళవారం నుంచి బుధవారం వరకు దిగువ ప్రాజెక్ట్‌లకు 10,884 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తెలంగాణలో విద్యుత్ ఉత్పాదన అనంతరం నాగార్జునసాగర్‌కు 5,367, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400, హంద్రీనీవా సుజలస్రవంతికి 1,617, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరా ద్వారా 1,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో 2.492 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేశారు. పంప్‌మోడ్ ఆపరేషన్ ద్వారా 5,846 క్యూసెక్కుల నీటిని డ్యాం దిగువ నుంచి తోడి శ్రీశైలం జలాశయంలోకి పంపారు. బుధవారం సాయంత్రానికి జలాశయంలో 119.1976 టీఎంసీల నీరు ఉంది. డ్యాం నీటిమట్టం 864.10 అడుగులకు చేరుకుంది.



తళుక్కుమన్న తారలు

కర్నూలు నగరంలో సినీ తారలు సంయుక్త మీనన్, మీనాక్షి చౌదరి తళుక్కుమన్నారు. బుధవారం నగరంలో సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి విచ్చేయడంతో వారిని చూసేందుకు అభిమానులు భారీగా తరలివచ్చారు. హీరోయిన్లు అభిమానులకు అభివాదం చేస్తూ సెల్ఫీలు దిగి, నృత్యం చేస్తూ సందడి చేశారు.

శ్రీశైలం డ్యాంపై ఆక్టోపస్ మాక్ డ్రిల్

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం డ్యాం భద్రతపై ఆక్టోపస్ దళాలు బుధవారం రాత్రి మాక్‌డ్రిల్ నిర్వహించాయి. జాతీయ ఆస్తులపై శత్రుదేశాలు, టెర్రరిస్టులు, విధ్వంసకర శక్తులు దాడి చేసే అవకాశాలు ఉన్నాయనే ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం మేరకు ఆక్టోపస్ దళాలు మాక్ డ్రిల్ నిర్వహించారు. ముందుగా అన్ని శాఖల అధికారులతో ఆక్టోపస్ అధికారులు వ్యూపాయింట్ సమావేశమందిరంలో సమావేశమై జాతీయ విపత్తు జరిగిన, జరగబోతున్న సందర్భంలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. రెవెన్యూ, వైద్యారోగ్య, ఫైర్, జలవనరుల శాఖల అధికారులతోపాటు, డ్యాం వద్ద కాపలా ఉన్న స్పెషల్ ప్రొటెక్షన్‌ఫోర్స్, సివిల్ పోలీసులతో ఆక్టోపస్ దళాలు కలిసి డ్యాం పరిసర ప్రాంతాల్లో ఆపరేషన్ నిర్వహించారు.



ఆక్టోపస్ దళాలకు సూచనలిస్తున్న అధికారులు

13 మంది డిబార్

కర్నూలు కల్చరల్: డిగ్రీ పరీక్షల్లో బుధవారం 13 మంది డిబార్ అయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 61 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు మొదటి సెమిస్టర్‌కు 10,135 మందికి 8,875 మంది విద్యార్థులు హాజరు కాగా 1,260 మంది, ఐదో సెమిస్టర్‌కు 4424 మందికి 3935 మంది హాజరు కాగా 489 మంది గైర్హాజరైనట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. కాగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో చూచిరాతకు పాల్పడిన 13 మంది విద్యార్థులను డిబార్ చేసినట్లు తెలిపారు.

'కూటమి'కి రైతు సంక్షేమం పట్టదు!



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- మోసపూరిత హామీలతో నిలువునా ముంచేసింది
- దగా పడిన రైతుకు న్యాయం జరిగే దాకా పోరాడదాం
- 'అన్నదాతకు అండగా– వైఎస్సార్‌సీపీ'ని జయప్రదం చేయండి
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: కూటమి ప్రభుత్వానికి రైతు సంక్షేమం పట్టదని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. బుధవారం పాణ్యం వైఎస్సార్‌సీపీ కార్యాలయం ఆవరణలో పార్టీ నేతలు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 13వ తేదీన చేపట్టనున్న 'అన్నదాతకు అండగా – వైఎస్సార్‌సీపీ' కార్యక్రమా న్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు కూటమి నేతలు రైతులకు అలివిగాని హామీలు ఇచ్చి మోసం చేశారన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి కోతల సమయంలో అకాల వర్షాలకు ధాన్యం పూర్తిగా తడిసిపోయి నష్టపోయినా ప్రభుత్వం భరోసా ఇవ్వలేదన్నారు. ఆర్నెల్ల పాలనలో రైతులకు ఒరిగిందేమీ లేదన్నారు. ధాన్యం బస్తా రూ. 1,400 గగనంగా ఉందని, ఎరువుల బస్తా మాత్రం రూ. 200 అదనంగా పెరిగిందన్నారు. చివరికి రైతులే క్రాప్ ఇన్సూరెన్స్ కట్టుకోవాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఆర్‌బీకేల ద్వారా కేవలం ఈ-క్రాప్ బుకింగ్ చేసుకుంటే అన్ని రకాలుగా రైతులకు మేలు జరిగేదన్నారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన నాయకులు ప్రజలకు ఏమి చేయలేరన్నారు. దగా పడిన రైతు పక్షాన వైఎస్సార్‌సీపీ చేపట్టిన ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి రైతులు తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు. ఆయా నియోజకవర్గాల నుంచి వచ్చే రైతులు నూనెపల్లె బ్రిడ్జి సమీపంలోని ఉదయానంద హోటల్ వద్దకు ఉదయం 9.30 గంటలకు చేరుకోవాలన్నారు. అక్కడి నుంచి రైతులతో కలిసి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని రైతులకు ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని వినతి పత్రం రూపంలో కలెక్టర్‌కు అందజేస్తామన్నారు.

సాగునీటి ఎన్నికల్లో పోటీ చేయాలి..

ఈ నెల 14న జరిగే సాగునీటి సంఘాల ఎన్నికల్లో ధైర్యంగా పోటీ చేయాలని కాటసాని సూచించారు. అధికార పార్టీ నేతలు పోలీసుల సహాయంతో ఎవరినైనా పోటీకి దిగకుండా అడ్డుకుంటే తక్షణమే తనకు సమాచారం అందించాలన్నారు. 2014–19 మధ్య కాలంలో సాగునీటి కోసం పడిన ఇబ్బందులను రైతులు గుర్తు చేసుకోవాలన్నారు. ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని, ధైర్యంగా బరిలో నిలవాలన్నారు.

సీమకు 27 టీఎంసీలేనా..

రాయలసీమ రైతులపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని కాటసాని విమర్శించారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురిసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఇక శ్రీశైలంలో మన వాటా 27 టీఎంసీలేనని చెప్పడం ఎంత వరకు సమంజసమన్నారు. ప్రాజెక్ట్‌లో నీటిని విద్యుత్ ఉత్పత్తి పేరుతో దిగువకు విడుదల చేస్తున్నా అడిగేవారు లేరన్నారు. ఇటీవల నిర్వహించిన ఐఏబీ సమావేశంలో రబీలో ఆరుతడి పంటలు వేసుకోవాలని, వారబంధీతో నీరు వాడుకోవాలని ఇన్‌చార్జ్ మంత్రి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు ఏ నాడు కూడా సాగునీటి సమస్య రానివ్వలేదన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో రైతులు నీళ్ల కోసం కాల్వల గట్లపై పడిన పాట్లు మళ్లీ గుర్తుకొస్తున్నాయన్నారు.

పిన్నాపురం రైతులకు పరిహారం ఇప్పించి తీరుతాం..

సోలార్ పరిశ్రమ ఏర్పాటులో భూములు కోల్పోయిన పిన్నాపురం రైతులకు తప్పకుండా పరిహారం అందించేలా కంపెనీ అధికారులు, కలెక్టర్‌తో మాట్లాడుతున్నామన్నారు. కొంతమంది అధికారుల తప్పిదం వల్ల కొందరు రైతులకు పరిహారం అందలేదన్నారు. పిన్నాపురం రైతులకు అండగా తాను ఉంటానని, ఏ రైతు దిగులు చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎన్నికల సమయంలో తనపై ఆరోపణలు చేసిన వారు అధికారం వచ్చిన తర్వాత రైతులకు ఏమి చేశారని ప్రశ్నించారు. మొదటి నుంచి పిన్నాపురం రైతులు తరఫున అండగా నిలిచింది తానేనన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ మాజీ సభ్యులు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, కరుణాకరర్‌రెడ్డి, బాబు, శేషయ్య, బాలిరెడ్డి, రవిరెడ్డి, కృష్ణారెడ్డి, జయచంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జాకీర్‌ఉస్సేన్, ఎల్లగౌడ్, రాజన్న, సుధాకర్, బొజ్జన్న, రామచంద్రుడు, సేన్‌బాషా, ఆటో మాబు, సత్యాలు, రమణ, శ్రీనివాసులు, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగు నీటి ఎన్నికల సందడి

- 14న అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక
- 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నిక
- ఏర్పాట్లలో అధికారులు నిమగ్నం

నంద్యాల(రూరల్): జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల సందడి మొదలైంది. ఇప్పటికే జిల్లా యంత్రాంగం అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎన్నికల ప్రక్రియలో భాగంగా బుధవారం ప్రాదేశిక నియోజకవర్గాలు, సాగునీటి సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు జిల్లా యంత్రాంగం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈనెల 14న ప్రాదేశిక నియోజకవర్గాలకు ఎన్నికైన వారితో సమావేశం నిర్వహించి సాగునీటి వినియోగదారుల సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికల తేదీ, సమయం, వేదిక సమాచారాన్ని ఆదే రోజు మేజర్ ఇరి గేషన్ ప్రాజెక్టుల పరిధిలోని సాగునీటి సంఘాల అధ్యక్షులకు నోటీసుల ద్వారా అందజేస్తారు. ఈనెల 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికలకు సంబంధించిన సమావేశాలను నిర్వహించి చైర్మన్లను ఎన్నుకుంటారు. జిల్లాలో 261 సాగునీటి వినియోగదారుల సంఘాలు ఉండగా, వాటి పరిధిలో 14 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 4 ప్రాజెక్ట్ కమిటీలు ఉన్నాయి. వీటి కింద కేసీ కాల్వ కింద 52, ఎస్సార్బీసీ కింద 50, తెలుగుగంగ కింద 47, శివ భాష్యం ప్రాజెక్ట్ కింద 7, మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల కింద 104, మైలవరం కింద ఒకటి కలిపి మొత్తం 261 సాగునీటి వినియోగదారుల సంఘాలున్నాయి.

ఆయకట్టు వివరాలు

జిల్లాలోని సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు ఆయా పరిధిలోని ఆయకట్టు ఎకరాలు ముఖ్యం. జిల్లా పరిధిలో ఆయకట్టు విస్తారంగా ఉంది. కేసీ కెనాల్ కింద 2,65,000 ఎకరాలు, ఎస్సార్బీసీ పరిధిలో 1,50,000, తెలుగుగంగ కింద 1,15,000, చిన్ననీటి వనరులు కింద 82,000 ఎకరాల్లో ఆయకట్టు విస్తరించి ఉంది.

ఏకగ్రీవం కాని చోట రహస్య ఓటింగ్


సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఈనెల 4న రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎక్కడైనా ఎన్నిక ఏకగ్రీవం కాకపోతే చేతులెత్తి ఎన్నుకునే విధానాన్ని అనుసరిస్తే ఓటర్లు ఎవరికి ఓటు వేశారో అభ్యర్థులకు తెలిసిపోతుంది. ఇందువల్ల వారిని లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉంటుంది. మేనేజ్‌మెంట్ ఆఫ్ ఇరిగేషన్ సిస్టమ్స్(ఎన్నికల నిర్వహణ) రూల్స్, 118 ప్రకారం చేతులెత్తే పద్ధతి రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) ప్రసాదించిన భావ ప్రకటన స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తుంది. కనుక చేతులెత్తే విధానం కాకుండా రహస్య బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహించాలంటూ బెల్లన జగన్నాథం, చిరుమామిళ్ల శ్రీనివాసరావు హైకోర్టులో ఇటీవల రిట్ పిటీషన్లు దాఖలు చేశారు. 2020 నాటి లక్ష్మీసింగ్, ఇతరులు వర్సెస్ రేఖాసింగ్ ఇతరులు కేసులో రహస్య ఓటింగ్ అనేది రాజ్యాంగ పరమైన ప్రజాస్వామ్యంలో కీలకమైనదంటూ అపెక్స్ కోర్టు తన తీర్పులో స్పష్టం చేసిన విషయాన్ని కూడా పిటీషనర్లు పేర్కొన్నారు. ఈ పిటీషన్ రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాగూర్, రవి చీమలపాటి న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనానికి వెళ్లింది. ఏకాభిప్రాయం కుదరని చోట రహస్య బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకుటామనే రైతులను.. అందుకు అనుమతించాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రభుత్వాన్ని ఆదేశించింది. జిల్లా స్థాయి ఉన్నత అధికారులు కూడా నీటిపారుదల అధికారులు, తహసీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో ఇదే విషయాన్ని ప్రస్తావించారు. ఏకాభిప్రాయం కుదరని చోట రహస్య బ్యాలెట్ ద్వారా ఓటింగ్ నిర్వహించాలని వారికి ఆదేశాలు జారీ చేశారు.

కూటమి నేతల కుయుక్తులు

సాగునీటి ఎన్నికలు ఏకపక్షంగా జరిగేలా చూడాలని ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన ఇన్‌చార్జ్ మంత్రి పయ్యావుల కేశవ్‌ను జిల్లాలోని కూటమి నేతలు కోరినట్లు సమాచారం. అయితే రైతుల ఏకభిప్రాయంతోనే సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించేలా 2013లో సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో 2015 సెప్టెంబర్ చంద్రబాబు సర్కార్ హడావిడి చేస్తూ ఏర్పాట్లు చేసింది. అందుకు అనుగుణంగా సాగునీటి సంఘాల్లోని అన్ని కీలక పదవులు అప్పటి టీడీపీ నాయకులకు కట్టబెట్టారు. ప్రస్తుతం ఈ సాగునీటి ఎన్నికల్లోనూ కూటమి ప్రభుత్వ పెద్దలు తమ అనుయాయులకు కట్టబెట్టేందుకు అధికారులపై ఒత్తిడి పెంచేలా విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.



పకడ్బందీగా నిర్వహిస్తాం



మా పరిధిలోని 52 సాగు నీటి సంఘాలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను అన్ని మండలాలకు జారీ చేశాం. ఈనెల 14న అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక ప్రక్రియ ఉంటుంది. ఈ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారుల నుంచి మాకు ఆదేశాలు అందాయి.ఎలాంటి అవకతవకలు లేకుండా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేస్తాం.

– ప్రతాప్, ఈఈ కేసీ కెనాల్, నంద్యాల

కరువు నేలపై సర్కారు కాఠిన్యం

- ఎత్తిపోతల పథకాలు నిర్వీర్యం
- 'గురురాఘవేంద్ర' ఆయకట్టు రైతులకు తీరని అన్యాయం
- మరమ్మతులకు నోచుకోని పంపుహౌస్‌లు
- నిధులు విడుదల చేయని కూటమి ప్రభుత్వం
- రెండు కారుల పంటలకు సెలవు


ఒట్టిపోయిన బసలదొడ్డి రిజర్వాయర్


అలంకారప్రాయంగా మాధవరం స్టేజ్-2 పంపుహౌస్

మంత్రాలయం: అసలే కరువు ప్రాంతం. కాసిన్ని నీళ్లుంటేనే పంటల సాగు. లేదంటే వలసలు. అలాంటి కరువు రైతుల ఆశలను కూటమి సర్కారు కాలరాసింది. పంట చేలను బీళ్లుగా చేసి వేడుక చూస్తోంది. ఆశలను అడియాశలు చేసేసి తీరని నష్టం కల్గించింది. నదిలో వరదలా నీళ్లు పారుతున్నా చుక్కనీరు ఎత్తిపోయకుండా చేతులెత్తేసింది. రైతులపై కూటమి ప్రభుత్వానికి ఉన్న కపట ప్రేమను చాటుకుంది. గురురాఘవేంద్ర ప్రాజెక్టు పంప్‌హౌస్‌ల్లో చోరీలు జరిగి నెలలు గడిచినా మరమ్మతులకు పూనుకోలేదు. ఫలితంగా ఖరీఫ్, రబీ పంటల సాగుకు రైతులకు తీరని అన్యాయం జరిగింది.

గురు రాఘవేంద్ర ప్రాజెక్టు ఆశయం

జిలా పశ్చిమాన తుంగభద్ర దిగువ కాలువ శివారు ఆయకట్టును సస్యశ్యామలం చేసేందుకు ప్రభుత్వం గురురాఘవేంద్ర ప్రాజెక్టు నిర్మించింది. 1996లో ప్రభుత్వ అనుమతులు పొంది రూ.250 కోట్లు వెచ్చించి ప్రాజెక్టును పూర్తి చేశారు. ప్రాజెక్టు పరిధిలో ఒక మైనర్ ఇరిగేషన్, 11 ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు పరిధిలో 40 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. మంత్రాలయం నియోజకవర్గంలోని మూగలదొడ్డి, దుద్ది, మాధవరం, బసలదొడ్డి ఎత్తిపోతలు, సూగూరు మైనర్ ఇరిగేషన్, ఎమ్మిగనూరు నియోజకవర్గంలో సోగనూరు, పూలచింత, చిలకలడోణ ఎత్తిపోతలు, కోడుమూరు నియోజకవర్గంలో కృష్ణదొడ్డి, చింతమాన్‌పల్లె లిఫ్టు ఇరిగేషన్ పథకాలు నెలకొల్పారు.

చోరీల నష్టం రూ.2.70 కోట్లు

దుండగుల దుశ్చర్యతో ప్రాజెక్టు పరిధిలోని ఆరు ఎత్తిపోతల పథకాల పంపుహౌస్‌ల్లో సామగ్రి ధ్వంసమైంది. మంత్రాలయం పరిధిలోని మూగలదొడ్డి స్టేజ్-1లో రూ.18 లక్షలు, మాధవరం స్టేజ్-1 పంపుహౌస్‌లో రూ.1.46 కోట్లు, బసలదొడ్డి స్టేజ్-1 పంపుహౌస్‌లో రూ.12 లక్షలు, సోగనూరు స్టేజ్-1 పంపుహౌస్‌లో రూ.20 లక్షలు, పూలచింత స్టేజ్-1, స్టేజ్-2 పంపుహౌస్‌లోనూ రూ.40 లక్షలు, చిలకలడోణ స్టేజ్-1, స్టేజ్-2 పంపుహౌస్‌లో రూ.40 లక్షలు ఆస్తి నష్టం జరిగిందని ప్రాజెక్టు అధికారుల అంచనా.

ఎత్తిపోతల పథకాలు నిర్వీర్యం

చోరీల కారణంగా ఆరు ఎత్తిపోతల పథకాలు నిర్వీర్యంగా మారాయి. పంపుహౌస్‌ల మరమ్మతుల కోసం ప్రాజెక్టు అధికారులు ప్రతిపాదనలు పంపి 5 నెలలు గడిచిపోయాయి. మరమ్మతులకు రూ.17 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు పంపారు. అయితే ఇప్పటివరకు ప్రభుత్వం చిల్లిగవ్వ కూడా కేటాయించలేదు. కేవలం రాష్ట్ర విపత్తు ఉపశమన నిధి (ఎస్‌డీఎంఎఫ్) కింద రూ.1.28 కోట్లు మాత్రమే మంజూరు చేసింది. పథకం పరిధిలో 7 పనులు, జీతాలకు ఈ నిధిని వినియోగించనున్నారు. వచ్చిన ఈ అరకొర గ్రాంటుకు కూడా మోక్షం లేకపోయింది. టెండర్ల దశలోనే ఉండిపోయింది. ప్రభుత్వం చేతులెత్తేయడంతో మూగలదొడ్డి, పూలచింత పథకాలను రైతులే చందాలు వేసుకుని బాగు చేసుకోవాల్సి వచ్చింది. ఇక చిలకలడోణ, మాధవరం, బసలదొడ్డి పథకాల నుంచి సెంటు భూమికి నీరివ్వలేదు. పథకాల పరిధిలో దాదాపు 16 వేల ఎకరాలు వర్షాధారంగా మారడం విచారకరం. ప్రభుత్వం పంపుహౌస్‌ల మరమ్మతులను పట్టించుకోకపోవడం, నదిలో వరద నీరు ఏరులై పారినా చుక్క నీరు ఎత్తిపోయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. సాగు నీరు లేక ఆయకట్టు భూములు బీడుగా మారాయి.

తీరని నష్టం



మాధవరం ఎత్తిపోతల పథకం కింద మాకు 5 ఎకరాల సాగుభూమి ఉంది. ప్రస్తుతం రిజర్వాయర్‌లో చుక్క నీరు లేదు. పంట కాలువకు నీళ్లు రాకపోవడంతో వర్షాధారం కింద పత్తి పంటను వేసుకున్నాం. పెద్దగా దిగుబడులు రాలేదు. ప్రాజెక్టుకు నీళ్లు వచ్చింటే రెండు కారులు పంటలు వేసుకునేవాళ్లం. ఈ ఏడాది బొత్తిగా నీళ్లు ఇవ్వలేదు. ప్రభుత్వం రైతులను పట్టించుకోలేదు. ఈ ఏడాది పథకం కింద రైతులకు తీరని అన్యాయం జరిగింది.

– మల్లికార్జున, దొడ్డి బెళగల్

నిధులు మంజూరు కాగానే పనులు

గురురాఘవేంద్ర ప్రాజెక్టు పంపుహౌస్‌ల్లో చోరీల కారణంగా నీటి ఎత్తిపోత జరగలేదు. పంపుహౌస్‌ల మరమ్మతుల కోసం రూ.17 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు పూర్తి చేస్తాం. ఇటీవల ప్రభుత్వం ఎస్‌డీఎంఎఫ్ కింద రూ.1.28 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో ఆయా పంపుహౌస్‌ల్లో ఏడు పనులు చేయనున్నాం. పూర్తి స్థాయి బడ్జెట్ వస్తే పంపుహౌస్‌ల్లో పనులు పూర్తి చేస్తాం.

– విజయభాస్కర్ రెడ్డి, గురురాఘవేంద్ర ప్రాజెక్టు ఈఈ

క్లుప్తంగా

ఆడిట్‌కు అందని సహకారం

- సహకరించని ఉద్యోగులపై సూపరింటెండెంట్ ఆగ్రహం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో గత 20 రోజులుగా ఏజీ ఆడిట్ నిర్వహిస్తున్నారు. హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ చాంబర్‌లో ముగ్గురు సభ్యుల బృందం ఆడిట్ నిర్వహిస్తోంది. దాదాపు ఆరేళ్ల తర్వాత ఆడిట్‌కు రావడంతో ఫైళ్ల సంఖ్య అధికమైంది. ఈ క్రమంలో కొందరు ఉద్యోగులు ఆడిట్ బృందం అడిగిన ఫైళ్లు వారి ముందు ఉంచి వస్తున్నారు. అయితే తమకు ఫైళ్ల గురించి వివరంగా చెప్పడం లేదంటూ సూపరింటెండెంట్‌కు ఆడిట్ బృందం ఫిర్యాదు చేసింది. కొందరు ఉద్యోగులు తమకు సహకరించడం లేదని పేర్కొంది. కొన్ని ఫైళ్లు అర్థం కావడం లేదని, అడిగితే స్పందించడం లేదని ఆరోపించింది. ఆసుపత్రిలో గత కొన్నేళ్లుగా వైద్యపరికరాలు, స్టేషనరీ, సివిల్ పనులు, ఇతర వస్తువుల కొనుగోలు, పెట్టిన ఖర్చుకు సంబంధించిన వివరాలు, బిల్లులు సక్రమంగా లేవని ఆడిట్ అధికారులు చెప్పినట్లు తెలుస్తోంది. ఈ మేరకు బుధవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు పలువురు ఉద్యోగులను తన చాంబర్‌లోకి పిలిచి మందలించినట్లు సమాచారం. ఆడిట్ అధికారులు అడిగిన సమాచారం ఇవ్వడంతో పాటు వారికి వివరంగా చెప్పాలని ఆదేశించినట్లు తెలిసింది.

ట్రిపుల్‌ఐటీ డీఎం నుంచి మొదటి పీహెచ్‌డీ


దారా రాంబాబు

కర్నూలు సిటీ: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ డిజైన్ మ్యాన్‌ఫాక్చరింగ్ (ట్రిపుల్‌ఐటీ డీఎం) నుంచి మొట్టమొదటగా దారా రాంబాబు అనే వ్యక్తి పీహెచ్‌డీ పూర్తి చేశారు. బుధవారం ఆ ఇన్‌స్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐఐటీ తిరుపతి ఆచార్య అనిల్‌కుమార్, ట్రిపుల్‌ఐటీ డీఎం ఆచార్య బి.ఎస్ మూర్తి, అసోసియేట్ డీన్ డాక్టర్ కె.సత్యబాబు, డాక్టరేట్ కమిటీ సభ్యులు జె.కృష్ణయ్య, మణిప్రకాష్, అక్తర్ ఖాన్, ఈశ్వరమూర్తి పాల్గొని పీహెచ్‌డీ పట్టాను అందజేశారు. వారు మాట్లాడుతూ.. ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం జానలగడ్డకు చెందిన రాంబాబు సంస్థ నుంచి మొట్టమొదటగా పీహెచ్‌డీని పూర్తి చేశారన్నారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.మువ్వల పుల్లారావు పర్యవేక్షణలో రాంబాబు ట్రాపజోయిడల్, రాంబస్-ఆకారపు సోలార్ ఎయిర్ హీటర్ డక్ట్స్ యొక్క ద్రవ ప్రవాహం, ఉష్ణ లక్షణాలు గణన, ప్రయోగాత్మకం అనే అంశంపై పరిశోధనలు చేశారన్నారు. సోలార్ ఎయిర్ హీటర్ వేడి గాలిని అందిస్తుంది. ఇదీ వ్యవసాయ ఉత్పత్తులను ఎండబెట్టడం, స్పేస్ హీటింగ్, హెచ్‌వీఏసీ సిస్టమ్, కాంక్రీట్ నిర్మాణాలను క్యూరింగ్ చేయడం వంటి అనేక వాస్తవిక అవసరాల కోసం వినియోగించుకునేలా ఉంటుందన్నారు.

వీఓఏగా తప్పుకోవాలని బెదిరింపులు

- రేమడూరులో బరితెగించిన కూటమి నాయకులు


పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు అందిస్తున్న వీఓఏ రూప

కల్లూరు: వీఓఏ బాధ్యతల నుంచి తప్పుకోవాలని కూటమి పార్టీల నాయకులు హత్యా బెదిరింపులు చేసినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు.. మండల పరిధిలోని రెమడూరు గ్రామంలో ఝాన్సీ గ్రామైక్య సంఘం వీఓఏ (బుక్‌కీపర్)గా సీహెచ్.రూప పనిచేస్తుంది. మంగళవారం రాత్రి కూటమి పార్టీల నాయకులు మారణాయుధాలతో ఆమె ఇంటికి వెళ్లి వీఓఏ బాధ్యతల నుంచి తప్పుకోవాలని బెదిరించారు. వారికి సర్ది చెప్పడానికి ప్రయత్నించగా మహిళ అని చూడకుండా దుర్భాషలాడారని వాపోయారు. అలాగే కూటమి నాయకులు ఏదైనా చేస్తారనే భయంతో తన భర్తను ఇంట్లో ఉంచి గదికి తాళం వేసి గ్రామ సంఘం సమావేశానికి వెళ్లగా అక్కడికి కూడా గుంపుగా వచ్చి.. వీఓఏగా తొలగిపోతావా? లేదా? అని లైట్లు ఆఫ్ చేసి తలుపులు వేసి దౌర్జన్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై మంగళవారం రాత్రి ఉలిందకొండ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

యువకుడి దుర్మరణం


మృతి చెందిన హుస్సేన్‌బాషా

బనగానపల్లె: ఆటో కింద నిద్రించిన వ్యక్తిని గమనించకుండా డ్రైవర్ వాహనాన్ని ముందుకు తీయడంతో కార్మికుడు అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానిక రౌండ్ల సమీపంలో బుధవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకోగా షేక్‌హుస్సేన్ బాషా (35) అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్‌ఐ దుగ్గిరెడ్డి తెలిపారు. వివరాలు.. పెద్ద వడుగూరు మండలం లక్ష్మంపల్లి గ్రామానికి చెందిన పెద్దరాజు వాహనాలకు వినియోగించే ఆయిల్‌లోడ్‌తో వస్తూ తెల్లవారుజామున వాహనాన్ని రోడ్డు పక్కన నిలుపుకుని అందులోనే నిద్రించారు. అలాగే లేబర్‌గా పని చేస్తున్న పాణ్యానికి చెందిన షేక్ హుస్సేన్‌బాషా చలి ఎక్కువగా ఉండడంతో వాహనం కింద పడుకొని నిద్రించారు. దీన్ని గుర్తించక ఉదయం డ్రైవర్ ఆటోను ముందుకు తీసుకెళ్లగా షేక్ హుస్సేన్‌బాషా తలపైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

బేస్‌బాల్ జాతీయ పోటీలకు ఎంపిక


క్రీడాకారిణి అక్షయను అభినందిస్తున్న దృశ్యం

రుద్రవరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన అక్షయ అనే విద్యార్థిని బేస్‌బాల్ అండర్-14 పోటీల్లో ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సుబ్బరాయుడు తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ గత నెల తిరుపతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని అక్షయ ఉత్తమ ప్రతిభ కనబరచిందన్నారు. ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని బిలాస్‌పూర్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థిని పాల్గొననున్నట్లు తెలిపారు.

ప్రభుత్వానికి కార్మికుల సమస్యలు పట్టవా?

- మూడో రోజుకు చేరిన మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల ఆందోళన
- విధులను బహిష్కరించి సమ్మె చేస్తున్న కార్మికులు


ధర్నా చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

కర్నూలు (టౌన్): విధులను బహిష్కరించాం. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఆందోళన చేస్తున్నా..ఈ ప్రభుత్వం పట్టిపట్టనట్లు వ్యవహరిస్తోందని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు మనోహర్, నగర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థ ఎదుట మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మె మూడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అరకొర జీతాలతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం తమకు వేతనాలు పెంచాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. చనిపోయిన కార్మికుడి కుటుంబంలో మరొకరికి ఉద్యోగం కేటాయించాలని డిమాండ్ చేశారు. తమ ప్రధాన డిమాండ్లు పరిష్కరించేంత వరకు సమ్మె వీడమని స్పష్టం చేశారు. అసోసియేషన్ నాయకులు శ్రీనివాసులు, రమేష్, జ్ఞానమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

పౌడర్ పరిశ్రమలో మహిళ దుర్మరణం


మృతి చెందిన లోకేశ్వరమ్మ

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని కోట్లవారిపల్లె ఇండస్ట్రియల్ ఏరియాలోని చిప్పగిరి సుబ్రమణ్యం ఫ్యాక్టరీలో ధర్మారం గ్రామానికి చెందిన లోకేశ్వరి (38) అనే మహిళ పౌడర్ బంకర్‌లో కాలు జారి పడి మృతి చెందినట్లు రూరల్ సీఐ రాకేష్ తెలిపారు. పట్టణానికి చెందిన చిప్పగిరి సుబ్రమణ్యం ఫ్యాక్టరీని మోహన్‌రెడ్డి అనే వ్యక్తి లీజుకు తీసుకొని నడుపుతున్నాడు. ఫ్యాక్టరీలో కార్మికురాలిగా పనిచేస్తున్న లోకేశ్వరి బుధవారం సాయంత్రం పనిలో నివగ్నమై ఉండగా ప్రమాదవశాత్తు పౌడర్ (బంకర్‌లో) జారి పడటంతో ఊపిరాడక మృతి చెందినట్లు సీఐ తెలిపారు. మృతురాలికి భర్త చిన్న మద్దయ్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

ఆదోని వైద్యులు కర్నూలుకు బదిలీ

కర్నూలు(హాస్పిటల్): ఆదోని మెడికల్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న పలువురు వైద్యులను రాష్ట్ర ప్రభుత్వం కర్నూలు మెడికల్ కాలేజీకి బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆదోని మెడికల్ కాలేజీ పనులు నిలిపివేసిన విషయం విదితమే. ఇదివరకే అక్కడ నియమించిన వైద్యులను ఇతర మెడికల్ కాలేజీలకు సర్దుబాటు చేస్తోంది. ఇందులో భాగంగా తాజాగా మరికొందరు వైద్యులను బదిలీ చేసింది. వీరిలో ప్రొఫెసర్ డాక్టర్ ఎం.మహేశ్వరరెడ్డి (జనరల్ మెడిసిన్), అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.సంపూర్ణ (పీడియాట్రిక్స్), అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఎస్.లోకానందం(అనాటమీ), డాక్టర్ మహమ్మద్ సాహిల్ (ఫోరెన్సిక్ మెడిసిన్), డాక్టర్ జి.హర్షవర్ధన్‌రెడ్డి (జనరల్ మెడిసిన్), డాక్టర్ ఎం.సుమలత (జనరల్ మెడిసిన్), డాక్టర్ ఎస్.వినోద్‌కుమార్ (రేడియో డయాగ్నోసిస్), డాక్టర్ వీసీ.బాలాజీ (డెంటిస్ట్) ఉన్నారు.

పాతాళగంగలో గుర్తు తెలియని మృతదేహం


ప్రవాహంలో కొట్టుకొచ్చిన మృతదేహం

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని పాతాళగంగ రోప్‌వే దిగువ భాగాన గుర్తు తెలియని మృతదేహం ప్రవాహంలో కొట్టుకువచ్చి మంగళవారం రాత్రి ఒడ్డున ఉన్న రాళ్ల వద్దకు చేరింది. గమనించిన మత్స్యకారులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. బుధవారం పంచనామా నిర్వహించి గుర్తు తెలియని మృతదేహంగా నమోదుచేసుకుని పోస్టుమార్టం నిమిత్తం సున్నిపెంట ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు సీఐ ప్రసాదరావు తెలిపారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. ఏ పోలీస్‌స్టేషన్‌లోనైనా మిస్సింగ్ కేసు నమోదై ఉన్నా, ఎవరైనా తప్పిపోయినట్లు ఫిర్యాదు అందినా శ్రీశైలం పీఎస్ (7842139185) ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పసిబిడ్డలకు పాల కోసం వెళ్లి మృత్యువాత


మృతిచెందిన ఈడిగ గిడ్డయ్య

కోసిగి: బతుకుదెరువు కోసం వలస వెళ్లిన వ్యక్తి పిల్లలకు పాలు, బిస్కెట్లు తీసుకురావడానికి రోడ్డు దాటుతుండగా బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన మేరకు వివరాలు.. మండల పరిధిలోని పల్లెపాడుకు చెందిన ఈడిగ గిడ్డయ్య (28) మంత్రాలయం మండలం మాలపల్లి నుంచి పల్లెపాడు, చింతకుంట మీదుగా కోసిగి వరకు ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. రెండు నెలలుగా గ్రామంలో పలువురు ఇళ్లకు తాళాలు వేసి సుగ్గికి వెళ్లిపోయారు. దీంతో ఆటో నుంచి రాబడి తగ్గి కుటుంబ పోషణ భారమైంది. అలాగే ఆటోకు మరమ్మతులు చేయించేందుకు డబ్బు లేదని ఆవేదన చెందేవాడు. ఈ స్థితిలో కుటుంబంతో సుగ్గికి వెళ్లి కాసిన్ని డబ్బులు సంపాదించుకుని వద్దామనుకున్నాడు. భార్య లక్ష్మీ, కుమారుడు, ఇద్దరు కుమార్తెలతో కలిసి తెలంగాణ రాష్ట్రం మక్తల్ వద్ద నాచర్ల గ్రామంలో పత్తి తీసే పనులు చేసేందుకు 15 రోజుల క్రితం వెళ్లారు. అక్కడ మంగళవారం రాత్రి పిల్లలకు పాలు, బిస్కెట్లు తీసుకురావాలని రోడ్డు దాటి వెళ్లాడు. తిరిగి రోడ్డు దాటుతుండగా హైవేపై వేగంగా వచ్చిన బస్సు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కళ్లెదుటే భర్త ఆకస్మిక మృతి చెందడంతో భార్య లక్ష్మీ, చిన్నారులు శోకసంద్రంలో మునిగారు. అక్కడి పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామం పల్లెపాడుకు తీసుకొచ్చారు. ఆటో నడుపుకుంటూ అందరికీ సుపరిచితుడైన యువకుడి ఆకస్మిక మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభం


సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న నటీమణులు మీనాక్షి చౌదరి, సంయుక్త మీనన్

కర్నూలు (టౌన్): నగరంలో బుధవారం సీఎంఆర్ షాపింగ్ మాల్ ఆర్భాటంగా ప్రారంభయ్యింది. స్థానిక పార్కు రోడ్డులో నూతన షోరూంను సినీతారలు సంయుక్త మీనన్, మీనాక్షి చౌదరితో పాటు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టీడీపీ సీనియర్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డిలు, సీఎంఆర్ ఫౌండర్, చైర్మన్ మావూరి వెంకటరమణ, ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మావూరి మోహన్ బాలాజీ పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం షాపింగ్ మాల్‌లోని నాలుగు ఫ్లోర్లలో ఏర్పాటు చేసిన ఫ్యాషన్ వస్త్రాలు, అన్ని రకాల చీరలు, రెడీమేడ్, గర్ల్స్, బాయిస్, కిడ్స్ వేర్, ఆభరణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల్లో అతి పెద్ద వస్త్ర వ్యాపార సంస్థ సీఎంఆర్ టెక్స్‌టైల్స్, జ్యువెలరీ ప్రైవేట్ లిమిటెడ్ షాపింగ్ మాల్‌ను కర్నూలులో ప్రారంభిస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. 4 దశాబ్దాలుగా నాణ్యమైన వస్త్రాలు ప్రజలకు అందిస్తున్నామన్నారు. కర్నూలులో ప్రారంభిస్తున్న 40వ షోరూంను ప్రజలు ఆదరించాలని కోరారు. సినీతారలు సంయుక్త మీనన్, మీనాక్షి చౌదరి మాట్లాడుతూ.. వస్త్ర ప్రపంచంలో ప్రముఖ సంస్థగా రాణిస్తున్న సీఎంఆర్ షోరూంలో ప్రజలు మెచ్చే అన్ని రకాల వస్త్రాలు తక్కువ ధరల్లో ఉన్నాయన్నారు. సొంత మగ్గాలపై వేయించిన వస్త్రాలను మార్కెట్‌లో మరెవ్వరూ ఇవ్వని విధంగా తక్కువ ధరలకు సీఎంఆర్ అందిస్తుందన్నారు. సీఎంఆర్ అంటే వన్‌స్టాప్ షాపు అని అన్ని రకాల వైరైటీలు, డిజైన్లు, నేటి యువతరానికి నచ్చే విధంగా ఉన్నాయన్నారు. బెంగుళూరు, హైదరాబాదు వంటి మహా నగరాలకు వెళ్లకుండా క్రిస్మస్, కొత్త సంవత్సరం, సంక్రాంతి పండుగలకు సీఎంఆర్‌లో షాపింగ్ చేయాలన్నారు. సినీ తారలు రావడంతో షోరూంకు పెద్ద సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. అభిమానులకు అభివాదం చేస్తూ, సెల్ఫీలు దిగుతూ డ్యాన్స్‌తో అలరించారు.

ఆలూరు సీహెచ్‌సీలో అరుదైన శస్త్రచికిత్స

- యువతి రొమ్ము నుంచి 630 గ్రాముల కణితి తొలగించిన వైద్యులు

ఆలూరు రూరల్: ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు ఓ యువతికి అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. రొమ్ము నొప్పితో బాధపడుతున్న ఓ యువతికి శస్త్రచికిత్స చేసి 630 గ్రాముల కణితిని తొలగించినట్లు సివిల్ సర్జన్ మయూర్ కుమార్ బుధవారం తెలిపారు. పట్టణానికి చెందిన ఓ యువతి ఆరు సంవత్సరాలుగా కుడి రొమ్ము నొప్పితో బాధపడుతూ మంగళవారం ఆస్పత్రికి వచ్చిందన్నారు. యువతికి ఎక్సైసన్, బయోప్సి ఆఫ్ ఫైబ్రోడినోమా ఆఫ్ బ్రస్ట్ అనే వ్యాధి గుర్తించామన్నారు. ఇలాంటి కేసులు చాలా అరుదని చెప్పారు. యువతికి ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద ఆపరేషన్ చేసి 630 గ్రాముల కణితిని తొలగించామన్నారు. సర్జరీ చేసిన కుట్లు, మచ్చలు కనిపించకుండా ఆధునిక టెక్నాలజీ ద్వారా ఆపరేషన్ చేసినట్లు చెప్పారు. అనంతరం యువతి ఆరోగ్యంగా ఉండడంతో అదే రోజు సాయంత్రం మందులు ఇచ్చి డిశ్చార్జ్ చేసినట్లు వెల్లడించారు.

30 ఏళ్లలో తొలిసారి

ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రి 30 ఏళ్ల చరిత్రలో ఇది అరుదైన ఆపరేషన్ అని సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ వాహిద్ తెలిపారు. గతంలో ఇక్కడ ఇలాంటి శస్త్ర చికిత్సలు చేయలేదన్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయన్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లతో పాటు సిజేరియన్ తప్పనిసరి అయిన కేసుల్లో గర్భిణులకు సిజేరియన్లు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వికసిత్ భారత్ వ్యాసరచన పోటీల్లో ప్రతిభ


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న వీసీ పి.ఎస్.షా.వలిఖాన్

కర్నూలు కల్చరల్: వికసిత్ భారత్ వ్యాసరచన పోటీలకు ఎంపికైన డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ విద్యార్థులను వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.ఎస్.షా.వలిఖాన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.లోకనాథ అభినందించారు. ఈ మేరకు బుధవారం వర్సిటీలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో వీసీ మాట్లాడారు. నేషనల్ యూత్ ఫెస్టివల్ –2025ను పురస్కరించుకొని ఎన్ఎస్ఎస్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ఈనెల 2 నుంచి 5వ తేదీ వరకు 'వికసిత్ భారత్ యంగ్ లీడర్ డైలాగ్' అనే అంశంపై రాష్ట్రవ్యాప్తంగా కళాశాలలు, వర్సిటీ స్థాయి విద్యార్థులకు ప్రాథమిక దశ ఆన్‌లైన్ క్విజ్ పోటీలను నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో ఉర్దూ వర్సిటీకి చెందిన ఎంఏ ఇంగ్లిష్ మొదటి సంవత్సరం విద్యార్థులు షేక్ ఫాతిమా, షేక్ ముస్తాఫా, ఎంఏ ఇంగ్లిష్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని జాస్మిన్ జహాన్, ఎమ్మెస్సీ జువాలజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని సోబియా, ఎంఏ ఉర్దూ మొదటి సంవత్సరం విద్యార్థిని షేక్ కరిష్మా పోటీల్లో పాల్గొని రెండవ దశలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ విద్యార్థులు ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ పాల్ కృపాకర్, డాక్టర్ బి.వెంకటప్ప, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఏజెంట్‌కే న్యాయం జరగడం లేదు!

- మాజీ ఎమ్మెల్యే కాటసాని వద్ద వాపోయిన టీడీపీ కార్యకర్త
- పిన్నాపురం రైతులకు పరిహారం విషయంలో అన్యాయం చేశారని ఆవేదన


మాట్లాడుతున్న గువ్వల పెద్ద సుబ్బడు

పాణ్యం: 'సార్ నా పేరు గువ్వల సుబ్బడు.. ఊరు పిన్నాపురం. నేను టీడీపీ ఏజెంట్‌ను. ఓటు హక్కు వచ్చినప్పటి నుంచి టీడీపీ కోసం పనిచేశాను. 2024లో టీడీపీ తరఫున ప్రచారం చేసి ఏజెంట్‌గా కూర్చున్నాను. కూటమి ప్రభుత్వం మా గ్రామ రైతులకు సోలార్ పరిహారం చెల్లింపులో అన్యాయం చేస్తోంది. గ్రామ రైతులకు అండగా ఉండే టీడీపీ నాయకుడు లేరు. అందుకే అధికార పార్టీ నుంచి ప్రతిపక్ష పార్టీలోకి వచ్చాను. మీతోనే రైతులకు న్యాయం జరుగుతుంది' అంటూ పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఎదుట రైతు సుబ్బడు వాపోయారు. పిన్నాపురం గ్రామంలోని 212 సర్వే నంబర్‌లో సోలార్ పరిశ్రమ ఏర్పాటు చేయడంతో రైతులు భూములు కోల్పోయారు. కొందరు రైతులకు ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో అప్పటి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అధికారులు, స్థానిక ప్రజల సమక్షంలో సర్వే చేయించి భూమి సాగుదారులైన రైతులకు కంపెనీ పరిహారం ఇవ్వాలని ప్రతిపాదించారు. అయితే పరిహారం ఆలస్యం కావడం, ఎన్నికలు రావడంతో రైతులకు పరిహారం అందలేదు. తర్వాత కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు దాటినా రైతులకు న్యాయం జరిగే పరిస్థితి లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో బుధవారం నంద్యాల జిల్లా పాణ్యం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సుబ్బడు తనకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని మైక్ అందుకుని అందరి సమక్షంలో తన ఆవేదనను వెలిబుచ్చాడు. ఇందుకు కాటసాని స్పందిస్తూ భూమి కోల్పోయిన ప్రతి రైతుకు అండగా ఉంటామన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్


నిందితుల అరెస్టు చూపుతున్న టౌన్ సీఐ, ఎస్ఐ, పోలీసులు

నందికొట్కూరు: దొంగతనాలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న ముగ్గురిని పట్టణ పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. వివరాలు.. నందికొట్కూరుకు చెందిన షికారి కమ్మూరు, నానా సింగ్, అమర్‌సింగ్ పట్టణంలో తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడేవారు. ఈ క్రమంలో బుధవారం డీఎస్పీ రామాంజనేయులు ఆదేశాల మేరకు.. స్థానిక సవారమ్మ గుడి వద్ద కేజీ రోడ్డుపై టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్ నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా వారి దొంగతనాల చిట్టా బయటపడింది. నిందితుల నుంచి రెండు తులాల బంగారు గొలుసు, 15 తులాల వెండి పట్టీలు, రూ.55 వేలు నగదు స్వాధీనం చేసుకునట్లు టౌన్ సీఐ తెలిపారు. షికారి కమ్మూర్‌పై నందికొట్కూరు, కర్నూలు 4వ పట్టణ పోలీసుస్టేషన్‌లో పలు చోరీ కేసులు నమోదై ఉన్నాయని, అమర్‌సింగ్‌పై ఇప్పటివరకు 14 చోరీ కేసులు నమోదై ఉన్నట్లు టౌన్ సీఐ వెల్లడించారు.